క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

కొల్లిపర: సీజనల్ వ్యాధుల పట్ల గ్రామంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ అన్నారు.బుధవారం ఆమె మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో మండల వ్యాప్తంగా విస్తరంగా వర్షాలు కురువడంతో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు చేరి రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వేడి చేసిన గోరు వెచ్చని నీటిని తాగాలన్నారు. ఈ సీజన్‌లో జ్వరం, మలేరియా, డెంగీ , కలరా వ్యాధులు వచ్చే అవకాశాలు ఉందని , అనారోగ్యం అనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలని సూచించారు.

అభ్యసన వైకల్యంపై అవగాహన



కొల్లిపర: స్థానిక భవిత కేంద్రం ఆధ్వర్యంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఆర్) లో బుధవారం డిస్లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యసన వైకల్యాల పిల్లల్లో పురోగతి తీసుకురావాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం కొల్లిపరలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవో2 ఝాన్సీలత, ప్రధానోపాధ్యాయులు పి.మృత్యుంజయ రావ్, కరీమూన్ నూర్జహాన్, సురేష్, పాపయ్య, సీఆర్‌పి రమేష్‌బాబు పాల్గొన్నారు.

పాంచాళవరంలో 'పొలం పిలుస్తోంది'



అమర్తలూరు(వేమూరు): వర్షాల వల్ల వరి పైరుకు పాము పొడ, అగ్గి తెగులు వ్యాప్తించడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి తెలిపారు. అమర్తలూరు మండలంలోని పాంచాళవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో పాము పొడ, అగ్గి తెగుళ్ల నివారణకు హెక్సాకోనజోల్, ట్రై సైక్లోజోల్ మందులు పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేమూరు: వరిపైరులో అధికమొత్తంలో ఎరువులు, పురుగు మందులు వాడరాదని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత అన్నారు. వేమూరు మండలంలోని అబ్బనగూడవి, వరహాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని ఆమె రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

మంగళగిరి: స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటుపై స్వర్ణకార సంక్షేమ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర కేబినెట్ సమావేశంలో స్వర్ణకార కార్పొరేషన్‌కు ఆమోదం తెలపడం హర్షణీయమని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధులు షరాఫ్ బజార్‌లోని సంఘం కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ పంపిణీ చేశా రు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గుంటి నాగరాజు, గాజుల శ్రీనివాస రావు, పారేపల్లి మహేష్ పాల్గొన్నారు.

లాంలో కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

లాం(తాడికొండ): బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టిన ఘటన తాడికొండ మండలం లాం గ్రామంలో జరిగింది. వివరాలు.. ఆర్టీసీ అద్దె ప్రాతిపదికన నడిచే బస్సు గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తుండగా లాం చలపతి పాఠశాల సమీపంలో మరో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో గుంటూరుకు చెందిన షేక్ ఖాసిం స్వల్ప గాయాలయ్యాయి. కారు డ్రైవింగ్‌లో ఖాసిం అప్రమత్తంగా ఉండటంతో ప్రమాదం తప్పిందని వాపోయాడు, లేకుంటే తనతో పాటు కుటుంబ సభ్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

తాడికొండ: గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పొన్నెకల్లు గ్రామానికి చెందిన మర్రిపూడి మురళీ కృష్ణ(34) మంగళవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి మర్రిపూడి కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

అయ్యయ్యో! పంటకాల్వలు!!

- పంటకాల్వల్లోకి పట్టణ మురుగు
- ఎక్కడికక్కడ మురుగునీరు పంట కాల్వల్లోకి వదిలేస్తున్న వైనం
- సాగు, తాగునీటి కాల్వల్లో మురుగునీటి ప్రవాహం
- గత ప్రభుత్వంలోనే పూర్తయినా అందుబాటులోకి రాని మురుగునీటి శుద్ధి ప్లాంటు



యడ్లపల్లి కాల్వలో కలుస్తున్న మల్లెపాడు డ్రెయిన్ మురుగు

తెనాలిరూరల్: పంట కాల్వలను మున్సిపాలిటీ మురుగు కాల్వలుగా మార్చేసింది. పట్టణంలోంచి వచ్చే మురుగును ఎక్కడికక్కడ పంట కాల్వల్లోకి వదిలేస్తున్నారు. దీంతో వేలాది ఎకరాలకు సాగునీటిని, పశ్చిమ డెల్టాలో పలు చెరువులను నింపే పంటకాల్వల నీరు మురుగునీటితో కలిసిపోతోంది.మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో ఒకటి దాదాపు పూర్తయినా ఇప్పటికీ అందుబాటులోకి తీసుకురానేలేదు. పట్టణం నడిబొడ్డున ప్రవహించే వుచ్చటయిన మూడు కాల్వలు తెనాలికి ఆంధ్రాప్యారిస్ అన్న నానుడి వచ్చేందుకు కారణాల్లో ఒకటి. ఒకప్పుడు జలరవాణా వైభవానికి సాక్ష్యంగా నిలిచిన నిజాంపట్నం కాల్వ, దానికి రెండు వైపులా సాగే తూర్పుకాల్వ, పడమటి కాల్వలు జిల్లా ధాన్యాగారమైన పశ్చిమ డెల్టాలోని వేలాది ఎకరాల పంటభూముల దాహం తీరుస్తున్నాయి. కాల్వ చివరి గ్రామాల్లోని చెరువులకు మంచినీటిని ఈ కాల్వలే తీసుకెళతాయి. ఇంత కీలకమైన పంట కాల్వలను మురికికూపాలుగా మారుస్తున్నారు స్థానికులు. 'పరిశుభ్రత' అవార్డులు అందుకున్న తెనాలి మున్సిపాలిటీ పంటకాల్వల క్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవటం లేదు. నీటిపారుదల శాఖ కూడా దీనిని నిరోధించే ప్రయత్నం చేసినట్టు లేదు. తమ స్వార్థం మినహా ఇతరుల క్షేమాన్ని పట్టించుకోకుండా కాల్వలను విషతుల్యం చేస్తున్నారు. తీర గ్రామాల్లోని మంచినీటి చెరువులకు ఈ నీరే శరణ్యమనీ, ఇలా చేయటం సమంజసం కాదని ఎవరూ అనుకోవటం లేదు. పట్టణంలోని తూర్పు, పడమర, మార్కెట్ వంతెన వద్ద చీలే పినపాడు, వైకుంఠపురం వద్ద పడమర కాల్వ నుంచి వెళ్లే యడ్లపల్లి కాల్వల్లోకి ఆయా ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీటిని వదిలి చేతులు దులుపుకుంటున్నారు. ప్రస్తుతం పంట కాల్వలన్నీ మురుగు కాల్వలుగా దర్శనమిస్తున్నాయి.

ప్రణాళిక లేకుండా యథేచ్ఛగా మురుగు కాల్వల నిర్మాణం కూడా ఇందుకు దోహదపడుతోంది. అటు పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలక్ష్యం కారణంగా కోట్లాది రూపాయల ప్రజా ధనం దుర్వినియోగమవుతోంది. ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోంది. మురుగు కాల్వల నిర్మాణం చేసేప్పుడు కనీసం లెవల్స్ కూడా చూడకుండా పనులు జరుగుతున్నాయి. పంట కాల్వలున్న ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉంటోంది. పంట కాల్వల్లోకి మురుగును వదలకుండా, సమగ్ర డ్రెయినేజీ పథకాన్ని అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గతంలోనే ఇందుకు హామీనిచ్చారు. మురుగునీటిని ఒక చోటికి చేర్చి, ట్రీట్‌మెంట ప్లాంట్ వంటిది ఏర్పాటు చేసి, ప్రజల అవసరాలకు తిరిగి నీరందిస్తే బాగుంటుందన్న సూచనను ప్రజలు చేస్తున్నారు. అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఈ క్రమంలో పట్టణంలో రెండు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు మంజూరయ్యాయి. పూలే కాలనీలో రూ.35 కోట్లతో చేపట్టిన నిర్మాణం గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయింది. మరిప్పుడు ప్లాంట్ కార్యకలాపాలు ఎందుకు ప్రారంభించటం లేదో తెలీటం లేదు. ఇప్పటికైనా తుదిమెరుగులు పూర్తి చేసి, పంటకాల్వల్లోకి మురుగు రాకుండా చేయాలని అటు రైతులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.



చెత్తతో నిండి ఉన్న పినపాడు కాల్వ



పడమర కాల్వలోలోకి మారీసుపేట ప్రాంతం డ్రెయినేజీ కలుస్తున్న దృశ్యం

త్వరలో అందుబాటులోకి ఎస్‌టీపీలు

మురుగు నీటిని సేకరించి శుద్ధి చేసి, ప్రజల అవసరాలకు అందించే ఆలోచన ఉంది. సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి. మురుగు నీటిని శుద్ధి చేసి, రైతుల సాగునీటి అవసరాలకు అందిస్తాం.

– బండి శేషన్న, మున్సిపల్ కమిషనర్

ఎంఎల్‌సీ ఓటుకు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చదివిన వారు అర్హులని చెప్పారు. డిగ్రీ సర్టిఫికెట్, అధార్ కార్డు, ఓటర్ కార్డు జిరాక్సులతో పాటు పాస్‌పోర్టు ఫోటోలతో మున్సిపల్ కార్యాలయంకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

13వ వార్డు సచివాలయంలో ట్యాబ్ అపహరణ

కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సచివాలయ ఉద్యోగులు

తెనాలిఅర్బన్: స్థానిక 13వ వార్డులోని వార్డు సచివాలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. మున్సిపల్ అధికారుల కథనం ప్రకారం చినరావూరు కమ్యునిటీ హాల్ పై అంతస్తులో 13వ వార్డు సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దానిలోని సీలింగ్ సోమవారం రాత్రి కూలి పెద్ద ప్రమాదం తప్పిన విషయం తెలిసిందే. దానిలో మంగళవారం విధులు నిర్వహించిన ఉద్యోగులు రాత్రి సమయంలో తాళం వేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి చూడగా గ్లాస్ డోర్ తెరచి ఉంది. దీంతో ఉద్యోగులు దానిని పరిశీలించగా లోపలున్న అరమరకు సంబంధించిన ర్యాక్‌లు తెరచి వస్తువులు చెల్లచెదురుగా పడిఉన్నాయి. అంతేకాకుండా ట్యాబ్ ఒకటి కన్పించలేదు. దీంతో వారు మున్సిపల్ కార్యాలయంకు వచ్చి కమిషనర్ బండి శేషన్నకు దీనిపై ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన కౌన్సిలర్ కుర్రా సుజాతతో కలిసి సచివాలయంను పరిశీలించారు. దీనిపై విచారణ జరుగుతుందని ఆయన తెలిపారు. ఇంకా ఏమైన వస్తువులు చోరీకి గురయ్యాయనే దానిని పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

వాస్తవాలు తెలుసుకుని మాట్లాడండి

- సచివాలయ నిర్మాణం టీడీపీ హయాంలోనే జరిగింది
- వైఎస్సార్ సీపీ హయాంలో అంటూ అవాస్తవ ప్రచారం
- పచ్చపత్రిక అసత్య కథనంపై వైఎస్సార్ సీపీ నేతల మండిపాటు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తెనాలి: పట్టణ చినరావూరులోని 13వ వార్డు సచివాలయం పైఅంతస్తులోని వార్డు సచివాలయం సీలింగ్ కుప్పకూలటంపై నిజానిజాలు తెలుసుకోకుండా ఓ పచ్చపత్రికలో వక్రీకరించి అసత్యాలను రాశారని వైఎస్సార్ సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో రూ.49 లక్షలతో నిర్మించిన భవనం నాసిరకం పనుల కారణంగానే సీలింగ్ కుప్పకూలిందని రాయటం పూర్తిగా వాస్తవ విరుద్ధమన్నారు.

స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ దుబాయ్‌బాబు, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి అక్కిదాసు కిరణ్‌కుమార్, పార్టీ బీసీ సంఘ నేత పెదలంక వెంకటేశ్వరరావు, షేక్ ఖాజా, షేక్ జాకీర్ మాట్లాడారు. 13వ వార్డులో గతంలోనే నిర్మించిన కమ్యూనిటీ హాలుపై మొదటి అంతస్తును టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. 2017లో మున్సిపల్ నిధులు రూ.49 లక్షలతో నిర్మాణం ఆరంభించి 2019 జనవరి నాటికి పూర్తి చేశారని తెలిపారు. టీడీపీ హయాంలోనే అంటే 2019 జనవరి 5వ తేదీన పైఅంతస్తును ప్రారంభించినట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ ఆరంభించాక, 13వ వార్డు సచివాలయం ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనం పెచ్చులూడుతూ, వర్షపు నీరు లీకేజీతో ప్రస్తుత కమ్యూనిటీ హాలు పై అంతస్తులోకి మార్చినట్టు తెలిపారు. టీడీపీ హయాంలో నిర్మాణమైన పైఅంతస్తులో సంబంధిత కాంట్రాక్టరు నాసిరకం మెటీరియల్‌ను వాడిన కారణగానే సీలింగ్ కుప్పకూలిందని ఆరోపించారు. వాస్తవాలిలావుంటే అసలు భవనం వైసీపీ హయాంలోనే జరిగిందని, నాసిరకం పనులు చేశారంటూ తమ పార్టీపై బురద జల్లాలని చూడటం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో వీరిఓ కసుకుర్తి నాగమల్లేశ్వరరావు, వంపుగల్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పై అంతస్తు 2019 జనవరి 5న ప్రారంభించినట్టుగా అక్కడి శిలాఫలకం

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఉండే కరణం అమర్‌చంద్, జనార్ధనరావు హోటల్‌లో కార్మికులుగా పని చేస్తుంటారు. ఇటీవల మద్యం మత్తులో ఇద్దరు ఘర్షణ పడగా జనార్ధనరావు అమర్ చంద్‌ను నెట్టడంతో కిందపడి తలకు తీవ్ర గాయమైంది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ 6వ తేదీన మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన అనంతరం నిందితుడు పరారయ్యాడు. హోట ల్ నిర్వాహకుల వద్ద నిందితుడి వివరాలు లేకపోవడంతో విచారణ ఆలస్యమైందని సీఐ రమేష్‌బాబు తెలిపారు.

పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి

తాడేపల్లిరూరల్: పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ రైట్స్ అండ్ యాక్ట్ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి రామారావు తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రామారావు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ జీఓ ఎంఎస్ నంబర్ 102, 106 ప్రకారం ప్రతి నెల ఒక గ్రామంలో నిర్వహించాల్సి ఉందని గుర్తు చేశారు. ప్రతి నెల 30వ తేదీన పౌర హక్కుల దినోత్సవాన్ని తహసీల్దార్ కన్వీనర్‌గా వ్యవహరిస్తూ అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్లు ఆయన చెప్పారు.

నూతన కార్యవర్గం



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ అండ్ డీఎల్‌టీసీఎస్ స్టాఫ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెనాలి చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం ఎన్నికలను నిర్వహించారు. కార్యదర్శిగా అమర్తలూరి యోబు, కోశాధికారిగా షేక్ మాలింబీ, ఉపాధ్యక్షులుగా దుర్గపు శేఖర్ బాబు, ఎంహెచ్‌ఆర్ బాలాజీ, సంయుక్త కార్యదర్శులుగా గద్దె వెంకటేశ్వర రావు, మూకిరి విజయప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కేపీఎం ప్రకాష్ బాబు, కోలుకొండ శివ అప్పారావు, బొడ్డు శ్రీనివాసరావు, డి.పద్మజలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ఎల్.భీమారావు, బి.రమేష్ బాబులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు డి.శ్రీనివాస్, పలువురు ఐటీఐ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్



మాట్లాడుతున్న ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్

చెరుకుపల్లి: వర్షాల కారణంగా గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించి పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మండలంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అధికారులు ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు. విద్యుత్‌శాఖ ఏఈ పెరుగు శ్రీనివాసరావు మాట్లాడారు. మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి సుమలత, ఎంపీడీఓ షేక్ మహబుబ్ సుభాని, డిప్యూటీ తహసీల్దార్ ఎ.శాంతలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వెల్డర్ మృతి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం 16వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో వెల్డింగ్ పని చేసుకునే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. తాడికొండ గ్రామానికి చెందిన ఎస్‌కే మస్తాన్ వలి(50) అదే గ్రామంలో వెల్డింగ్ పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి విజయవాడ నుంచి జాతీయ రహదారి మీదుగా గుంటూరుకు వైపు వెళుతుండగా వడ్డేశ్వరం వద్ద ఆగిఉన్న టిప్పర్ లారీని ఢీకొని మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్ మృతిపై కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు మృతదేహాన్ని అప్పగించామని శ్రీనివాస్ తెలిపారు. మృతి చెందిన మస్తాన్‌కు భార్యతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం చేశాడు.

పార్కింగ్‌లో ఉన్న బైక్ చోరీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై బుధవారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వివరాలు.. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన విద్యార్థి సయ్యద్ అబ్దుల్ కొలనుకొండలో ఉండి స్థానికంగా ఉన్న యూనివర్సిటీలో చదువుతున్నాడు.

దసరా సెలవుల సందర్భంగా ఈనెల 5వ తేదీన తాను నివాసముంటున్న అయ్యప్ప నిలయం వద్ద సయ్యద్ అబ్దుల్ తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసి కంభం వెళ్లాడు. సెలవులు ముగిసిన అనంతరం 15వ తేదీ వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల వారిని విచారించి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రైతన్నకు తుపాను గుబులు

- రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాలు
- పొట్ట దశలో వరి
- భారీ వర్షం కురిస్తే దిగుబడిపై ప్రభావం
- ఆందోళనలో అన్నదాతలు



కొల్లిపర మండలంలో పొట్ట దశలో ఉన్న వరి పైరు

కొల్లిపర: తెనాలి నియోజకవర్గంలో వరి రైతులకు తుపాను గుబులు పట్టుకుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో రెండు రోజులుగా నియోజకవర్గంలో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో స్వల్పంగా ఈదురుగాలులతో వర్షాలు పడతంతో ప్రస్తుతం ఎక్కువ శాతం వరిపైరు పూతదశలో ఉందని ఇటువంటి సమయంలో వర్షాలు అధికంగా ఉంటే గింజకు మానుకాయ, గింజ పాలు సరిగ్గా పోసుకోకుండా తాలు గింజలు వచ్చే అవకాశాలు ఎక్కువ శాతం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెనాలి నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర మండలాల్లో సుమారు ఈ రబీ సీజన్‌లో 27 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. తెనాలిలో 13,533, కొల్లిపరలో 12,482 ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు.

కలవరపెడుతున్న వర్షాలు

జిల్లా వ్యాప్తంగా నాలుగు ఐదు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఓ వైపు ఎండ దంచి కొడుతూనే అక్కడక్కడా కొద్ది సమయానికి మబ్బులు పట్టి మోస్తరు వర్షాలు కురుస్తోంది. రెండు రోజులుగా బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. వరి పైరు ఇప్పుడే వరి పూతదశలో, గింజలు పాలు పోసుకోవటం జరుగుతుందని ఇటువంటి సమయంలో వర్షాలు కారణంగా గింజల్లో బలం లేక దిగుబడి తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం ఇలాగే ఉంటే సన్నరకం వరికి దోమకాటు వంటి చీడపీడలు ఆశించి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో మూడు, నాలుగు రోజుల పాటు తుపాను ప్రభావం ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడం రైతులను మరింత కలవర పెడుతోంది.

ఎక్కువ శాతం పొట్ట దశలో వరి పైరు

ప్రస్తుతం వరి పంట నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర మండలంలో ఎక్కువ శాతం పొట్ట దశలో ఉందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. కొన్నిచోట్ల గింజలు పాలుపోసుకుంటున్నాయని, మరి కొన్నిచోట్ల వరి పూత దశలో ఉన్నాయి. అవి మరో 7 నుంచి 15 రోజుల్లో గింజలు పాలుపోసుకునే దశకు చేరతాయంటున్నారు. ఇటువంటి సమయంలో పూత దశలో భారీ వర్షాలు కురిస్తే గింజకు సరైన పోషక విలువలు అందక దిగుబడి తగ్గుతుందన్నారు. చిన్నపాటి జల్లులతో వర్షాలు వస్తే వరి రైతులు ఈ రబీలో దిగుబడికి ఎటువంటి ఇబ్బందులు ఉండవు అని అధికారులు, రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నియోజవర్గంలో గత నెలలో వచ్చిన వర్షాలు కారణంగా కొన్నిచోట్ల వరి పంట పూర్తిగా నష్టం జరిగిందని, మిగిలిన పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. ఇటువంటి క్రమంలో మళ్లీ అధిక వర్షాలు వల్ల మిగిలిన పంటలో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి గింజలపై ప్రభావం



ప్రస్తుతం వరి పంటలో గింజలు పాలుపోసుకోవటం జరుగుతుంది. ఇటు వంటి సమయంలో కురుస్తున్న వర్షాలు కారణంగా గింజలలో వర్షం నీరు చేరి గింజకు కావల్సిన పోషకాలు అందక గింజలో బలం లేక పంట దిగుబడి తగ్గుతుంది. ఇటు వంటి సమయంలో భారీ వర్షాలు కాకుండా మోస్తరు వర్షంతో వర్షాలు ఆగిపోతే వరి రైతులకు ఇబ్బందులు తప్పుతాయి.

–మాదపాటి నాగేశ్వరరావు, కౌలు రైతు, కొల్లిపర మండలం

నేడు నృసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు

మంగళగిరి: పట్టణంలోని శ్రీ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఏ రామకోటిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి ఎగువ దిగువ సన్నిధులతో పాటు ఘాట్ రోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.